మెట్రోలిఫ్ట్‌లో బంగారు చైన్ గాయబ్

వెంగళరావునగర్, ఫిబ్రవరి 27 : మెట్రోస్టేషన్ లిఫ్ట్‌లో ఓ ప్రయాణికుడు బంగారు చైన్ పోగొట్టుకున్నాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఆర్.కె. పురానికి చెందిన ఐటీ ఉద్యోగి గొడుగు కరుణాకర్ సోమవారం ఉదయం 9 : 30 గంటలకు ఎల్బీనగర్‌లో మెట్రో రైలు ఎక్కాడు. రాయదుర్గం వెళ్లే రైలు మారేందుకు అమీర్‌పేట్‌లో దిగాడు. అక్కడి మెట్రోస్టేషన్ లిఫ్ట్‌లో 9 గ్రాముల బంగారు చైన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాజమ్మ (50) ఆదివారం తన స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా శంషాబాద్ సమీపానికి రాగానే ద్విచక్ర వాహనంపై నుంచి కిందకు పడిపోయింది. దీంతో తన కొడుకు శంషాబాద్‌లోని దవాఖానకు వెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, ఫిబ్రవరి 27: ప్రయాణికుల సమస్యల పరిష్కరించేందుకు నేడు(బుధవారం)మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు పోన్ నం. 9000406 069 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

నీరులేక.. వాడిపోతున్న మొక్కలు

- గతంలో హరితహారం కార్యక్రమం
- ప్రస్తుతం పట్టించుకోని యంత్రాంగం

మణికొండ, ఫిబ్రవరి 27 : ఆకుపచ్చగా.. ఆహ్లాదాన్ని అందించే మొక్కలు నేడు వాడిపోతున్నాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నార్సింగి నుంచి మొదలై ఖానాపూర్ గ్రామ సరిహద్దు వరకు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు మధ్య డివైడర్లలో మూడు కోట్ల నిధులు వెచ్చించి మొక్కలు నాటారు. హరితహారం పథకంలో భాగంగా మొక్కల పెంపకంపై అధికార యంత్రాంగం శ్రద్ధ చూపారు. నార్సింగి రోటరీ, బ్రిడ్జిపై పెట్టిన మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు, ఖానాపూర్ పోచమ్మ ఆలయ సమీపంలో రోడ్డు మధ్యలో నాటిన మొక్కలకు నీరు పోయడం మరిచారు. ఎక్కడ చూసినా మొక్కలు వాడిపోయి కన్పిస్తున్నాయి. వేసవిలో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నార్సింగి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలకు నీరులేక వాడిపోతున్న దృశ్యం

సీసీ రోడ్ల విషయంలోనూ..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణాల పనుల నేపథ్యంలో కాంట్రాక్టర్లు మొక్కలకు నీటిని పోయడం మరిచారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులు కొనసాగుతుండడంతో వీటిని నిర్లక్ష్యం చేస్తున్నారనే వాదనలు విన్పిస్తున్నాయి. ఎండలు ముదురుతున్న వేళ కాంట్రాక్టర్లు సీసీ రోడ్లకు నీటిని పోయకుండానే బిల్లులు మంజూరు చేసుకుంటున్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం నిద్రావస్థలో ఉండటంతో నాణ్యతాప్రమాణాలు గాలికొదిలేశారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్డుపై వదిలేసిన మొక్కల దృశ్యం

అక్రమ పార్కింగ్‌తో ఇక్కట్లు..



షేక్‌పేట్ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో కార్లను పార్కింగ్ చేసిన దృశ్యం

షేక్‌పేట్, ఫిబ్రవరి 27 : షేక్‌పేట్ డివిజన్‌లోని ఎంసీహెచ్ గ్రౌండ్ అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. గ్రౌండ్ సిబ్బంది నిర్లక్ష్యం పార్కింగ్ దారులకు వరంగా మారింది. గ్రౌండ్ గేట్‌కు తాళం వేయకుండా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తుండడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రౌండ్‌లో కొందరు కార్లను పార్కింగ్ చేసి పోతున్నారని, దీంతో అక్కడ ఆడుకోవడానికి వీలు లేకుండా ఉందని యువ క్రీడాకారులు వాపోతున్నారు. అప్పుడప్పుడు గ్రౌండ్‌లో తాగి ఖాళీ సీసాలు వదిలి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్లను పార్కింగ్ చేయకుండా, తాగుబోతులు రాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నేటి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఓ కళాశాలలో బుధవారం ఏర్పాట్లు చేస్తున్న కళాశాల ఉపాధ్యాయులు

చంద్రశేఖర్ ఆజాద్ చిరస్మరణీయుడు

బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన చంద్రశేఖర్ ఆజాద్ చిరస్మరణీయుడని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి నేపథ్యంలో కుమారస్వామి ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నరేశ్ సాగర్, మల్లేశ్, కార్తీక్, గోపాల్, అంగన్‌వాడీ టీచర్ కనకవ్వ పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 27

రేపు ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు

సికింద్రాబాద్,ఫిబ్రవరి 27: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి హాజరై మాట్లాడుతూ..ఈ నెల 29న అంబర్‌పేట నియోజకవర్గంలోని రాణా ప్రతాప్ గార్డెన్స్‌లో జరిగే హైదరాబాద్ జిల్లా ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఉండే మాదిగలు , మాదిగ ఉపకులాల , విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శేఖర్,మంథని శామ్యూల్, తుమ్మల శివ ప్రసాద్ మాదిగ, భూపతి సుజాత మాదిగ ,సూరారం సుజాత మాదిగ, వేణుగోపాల్ మాదిగ, రాజు మాదిగ, మహేష్ మాదిగ, డప్పు మహేష్ మాదిగ, రాజేష్ ముదిరాజ్, నందరాం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

నారాయణగూడలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మహాలక్ష్మి రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 27 : అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని పేదల కోసం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఇందిరానగర్ బస్తీకి చెందిన లలిత, పప్పిబాయిలకు మంజూరైన కల్యాణ చెక్కులను మంగళవారం నారాయణ గూడలోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ వీఆర్వో విష్ణు, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్, అభిషేక్ పాల్గొన్నారు.

వెంకటేశన్ రాజుకు తలసాని పరామర్శ

బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కిమ్స్ దవాఖానలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం దవాఖానకు వెళ్లి పరామర్శించారు. వెంకటేశన్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. - బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 27

మల్లయోధుడికి సన్మానం

గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఈ నెల 21న జరిగిన కుస్తీ పోటీల్లో 86 కేజీల విభాగంలో బల్కంపేట బస్తీకి చెందిన విజయ్‌కుమార్ సత్తా చాటి శివాజీ కేసరి బంగారు పతకాన్ని సాధించిన సందర్భంగా మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొత్తపల్లి శంకర్‌గౌడ్, కోశాధికారి రజనీకాంత్‌గౌడ్, మల్లయోధులు ధన, పవన్, సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొని విజేత విజయ్‌కుమార్‌ను అభినందించారు. - అమీర్‌పేట్, ఫిబ్రవరి 27

40 ఏండ్లుగా కష్టపడుతున్నా.. ఎంపీ టికెట్ ఇవ్వండి

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి 40 ఏండ్లుగా కష్టపడుతున్నానని, ఈసారి మల్కాజిగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐలో క్రియాశీలక పాత్ర పోషించానని, ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేస్తే గెలిపించేందుకు శక్తి వంచ లేకుండా కృషి చేశానన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలోనే అనేక కార్యక్రమాలను చేపట్టానన్నారు. నాటి నుంచి నేటి వరకు పదవులు ఆశించకుండా నిస్వార్థ సేవ చేశానన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసుకునేందుకు తనకు ఈ సారి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని, తద్వారా అన్నిరంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

అధికారికంగా నిర్వహించడం హర్షణీయం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తులసి శ్రీనివాస్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 27 : ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి తులసి శ్రీనివాస్ తెలిపారు. మార్చి 2న శ్రీపాదరావు జయంతిని అధికారికంగా జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు సీఎం, మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మీడియా సమావేశంలో తులసి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో శ్రీపాదరావు ఎమ్మెల్యే, స్పీకర్‌గా ఎన్నికై అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసీయేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు సుబ్రహ్మణ్యం, నాయకులు శ్రీనివాస్‌రావు, వంశీ, ద్రోణంరాజు రవికుమార్, సుబ్బారావు, మంగపతిరావు, వైష్ణవి ప్రసాద్, రాఘవరావు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొన్న అన్ని జిల్లాల ఉద్యోగులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 : యూనివర్సిటీ ఆవరణ అంతా పండుగ వాతావరణం నెలకొన్నది. మంగళవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల క్రీడలు దినమంతా కొనసాగాయి. తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాల ఉద్యోగులు నాల్గుజోన్లు ఏర్పడ్డారు. మహిళలు ఖోఖో, కబడ్డీ, టెన్నిస్ క్రీడల్లో పాల్గొనగా, పురుషులు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడలు కొనసాగాయి. ఇన్‌డోర్, అవుట్ డోర్, వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా కళాశాల డీన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలని, ఆటలు ఆడాలని సూచించారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ డైరెక్టర్ డా. రఘురామి రెడ్డి , పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

- కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు
- ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకూ వెంటపడుతాం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్, చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేటీఆర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్

అంబర్‌పేట, ఫిబ్రవరి 27: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల(ఆత్మీయ సమ్మేళనం) సమావేశం విజయవంతమైంది. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, అరికపూడి గాంధీ, మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే గంధ్ర వెంకట్రామరెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, తలసాని సాయికిరణ్ కూడా సమ్మేళనానికి వచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలను కేటీఆర్ ఉత్తేజపరిచారు. పదేండ్ల తెలంగాణ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీలను విమర్శించారు. అబద్ధపు 420 హామీలు కాంగ్రెస్ ఇచ్చిందని, మార్చి 17 తర్వాత హామీలు నెరవేర్చకపోతే ప్రజల తరపున కొట్లాడదామని అన్నారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉండి ఏమీ ఒరగబెట్టలేదని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు ఇవ్వకుండా ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పట్టు సడలలేదని నిరూపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ భవిష్యత్తులో నాయకులు, కార్యకర్తలకు మంచి అవకాశాలు కల్పించాలని కోరగా, కమిటీలు, పదవుల్లో తప్పనిసరిగా చోటు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి గజమాలతో కేటీఆర్‌ను సత్కరించారు. బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి కూడా కేటీఆర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, ఇ.విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వనం రమేశ్, కె.పద్మావతి డీపీరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సిద్ధార్థ్‌ముదిరాజ్, మేడి ప్రసాద్, నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, మధుసూధన్ రెడ్డి, శ్రీరాములుముదిరాజ్, కవితారావు, భారతిరెడ్డి, పల్లవి, స్వరూప, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొఫెసర్ కోదండరాం

ముషీరాబాద్, ఫిబ్రవరి 27: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సీఎంను కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదండరాం విచ్చేశారు. హైదరాబాద్ జిల్లా సహకార శాఖ అధికారి డి.రమాదేవి మాట్లాడుతూ.. తమ శాఖ తరపున జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసమితి నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య, ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, బొల్లం శ్రీనివాస్, రాంచందర్, రామారావు, భాస్కర్ రెడ్డి, వీరేశం, షోయబుల్లా ఖాన్, బీఆర్‌కె మూర్తి పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే సహించం

మాట్లాడుతున్న బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయ సంఘం పేరుతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ.. బీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చలామణి అవుతూ రవీందర్ క్యాలెండర్లు, డైరీలు తీస్తున్నామంటూ వివిధ పాఠశాలల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.యాదగిరి కూడా రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నాడని వారితో తమ సంఘానికి సంబంధం లేదన్నారు. అలాగే మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న కవిత సంఘం నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఆమె సభ్యత్వాన్ని శాశ్వతంగా తొలగిస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా కమిటీని కూడా రద్దు చేశామన్నారు. ఎవరైనా బీటీఎఫ్ పేరుతో వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిలుకాదేవ శంకర్, సలహాదారులు బొల్లారం రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దంకి బాబు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చక్కగా చదువుకుంటే బంగారు భవిష్యత్

విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

మణికొండ, ఫిబ్రవరి 27 : విద్యార్థులు చక్కగా చదువుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమయానంతర సాయంత్రంపు అదనపు తరగతులకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం మిఠాయిలు, కారప్పూస, అల్పాహారం అందజేశారు. మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.యాదగిరి, హెచ్ఎం నిరంజన్, వీ ఆర్ ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అందే లక్ష్మణ్‌రావులతో కలిసి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు రాజశేఖర్, రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27 : బంజారాహిల్స్ పీఎస్ పరిధిలోని ఓ వ్యాపారి ఇంట్లో ఆభరణాలు మాయమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రోడ్ నం.4 లోని స్టోన్ వ్యాలీలో ఉంటున్న వ్యాపారి సంయుక్త బీగాల ఇంట్లోని అల్మారాలో ఆభరణాలు పెట్టారు. 24న ఫంక్షన్ కోసం వెళ్లే సమయంలో నగల కోసం చూడగా వజ్రాల హారం, వజ్రపు చెవి రింగులు, బంగారు గొలుసు కనిపించలేదు. మొత్తం వెతకడంతో పాటు పనిమనిషి లక్ష్మిని వాకబు చేయగా తనకు తెలియదని చెప్పింది. దీంతో మంగళవారం బాధితురాలు సంయుక్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో పనిమనిషి మీద అనుమానం ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

అర్ధరాత్రి దాటే వరకు స్నూకర్ పార్లర్.. వ్యక్తి అరెస్ట్

అబిడ్స్, ఫిబ్రవరి 27 అర్ధరాత్రి దాటే వరకు స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు నిచ్చింది. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...రహీంపురా వద్ద ఉన్న ఎస్‌కే జిమ్‌లో అర్ధరాత్రి దాటిన తరువాత కూడా స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి మంగళ్‌హాట్ పోలీసులు దాడి చేసి పార్లర్ యజమాని నిఖిల్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

కవాడిగూడ, ఫిబ్రవరి 27: భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో మంగళవారం శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 2012 సంవత్సరం నుంచి 30 మందికి ప్రతినెలా 5 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు సీతారామరాజు, రాజగోపాల్, మదన్ మోహన్, విజయలక్ష్మి బిజ్జి కనకేష్ కుమార్ తెలిపారు.